

ఫ్లై ఓవర్స్ ఏవీ?, ఎక్కడ ??

నాలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తామని నాలుగేళ్ల కిందట వైసీపీ నేతల ప్రకటనలు

- ఒక్క ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయని వైనం
- శంకుస్థాపనకే పరిమితమైన మధురవాడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- కార్యరూపం దాల్చని గోపాలపట్నం ఆర్‌ఓబీ ప్రతిపాదన
- నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై కానరాని చిత్తశుద్ధి





హనుమంతువాక జంక్షన్‌లో స్తంభించిన ట్రాఫిక్ (ఇన్‌సెట్‌లో) మద్దిలపాలెం కూడలిలో నిలిచిపోయిన వాహనాలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"విశాఖను పరిపాలనా రాజధాని చేస్తాం. అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నాలుగుచోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, గోపాలపట్నంలో రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ), మధురవాడలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తాం."

- ఇవీ వైసీపీ అధికారం చేపట్టిన కొత్తలో ఆ పార్టీ నేతలు, జీవీఎంసీ అధికారులు చేసిన ప్రకటనలు. ఐదేళ్లు గడిచిపోయాయి. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి. నగరంలో ఒక్క ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా జరగలేదు. మధురవాడలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన నేతలు ఆ తర్వాత ఆ విషయాన్నే మరిచిపోవడంతో పనులు మొదలుకాలేదు.

నగరంలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి కోసం రాష్ట్రంతోపాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి ఎంతోమంది నగరానికి వలస వస్తున్నారు. జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నగరంలో అన్నిరకాల వాహనాలు కలిపి 2005లో దాదాపు మూడు లక్షలు ఉండేవి. 2012 నాటికి ఈ సంఖ్య 5.5 లక్షలకు పెరిగింది. ప్రస్తుతం...2024 మార్చి నాటికి 15 లక్షలకు చేరిందని రవాణా శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో 80 శాతం ద్విచక్ర వాహనాలు ఉండగా, మిగిలినవి ఆటోలు, కార్లు, లారీలు, వ్యాన్‌లు, బస్సులు. నిత్యం లక్షలాది వాహనాలు రోడ్డెక్కుతుండడంతో ప్రధాన కూడళ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ఇక నగరం మధ్య నుంచి జాతీయ రహదారి ఉండడం కూడా ట్రాఫిక్ సమస్య జటిలంగా మారడానికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రాకపోకలు సాగించే వాహనాలు, భారీ వాహనాలు సైతం నగరం మీదుగానే ప్రయాణిస్తున్నాయి. నగరంపై ఒత్తిడి తెచ్చేందుకు అనకాపల్లి-పెందుర్తి-ఆనందపురం రహదారిని ఆరు లేన్లకు విస్తరించారు. అయినప్పటికీ చాలామంది నగరం మీదుగానే రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ ఆశించిన స్థాయిలో తగ్గలేదు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా నగరంలో రోడ్లను విస్తరించడం లేదు. దీని వల్ల సిగ్నల్ పడితే వాహనాలు బారులు తీరిపోతున్నాయి. గాజువాక, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, హనుమంతవాక, పీఎం పాలెం కార్‌షెడ్ జంక్షన్ల వద్ద అయితే ఉదయం, సాయంత్రంపూట రెండు, మూడుసార్లు సిగ్నల్ పడితేగానీ కూడలి దాటలేని పరిస్థితి ఉంటోంది. ఇటు గాజువాక నుంచి కొమ్మాది కూడలి దాటాలంటే రద్దీ సమయాల్లో కనీసం గంటన్నర నుంచి రెండు గంటలు పడుతుంది. దీంతో చాలామంది త్వరగా గమ్యం చేరుకోవాలనే భావనతో సిగ్నల్ జంపింగ్ చేస్తున్నారు. ఇది రోడ్డు ప్రమాదాలకు కారణంగా మారుతోంది. నగరంలో ప్రతిరోజూ సగటున నాలుగు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటివల్ల ... మిగతా 4వ పేజీలో

నగరంలో వాహనాల సంఖ్య పెరుగుదల
2005లో మూడు లక్షల వాహనాలు
2012లో 5.5 లక్షల వాహనాలు
2024 నాటికి 15 లక్షలు
2030 నాటికి 25 లక్షలు (అంచనా)



వేములపాటి హనిత

స్ఫూర్తి దాయకం హనిత విజయం

సివిల్స్‌లో సత్తా చాటిన నగరానికి చెందిన వేములపాటి హనిత

- 887 ర్యాంకు సాధన..
- అరుదైన వ్యాధితో పదేళ్లుగా వీల్ చైర్‌కే పరిమితం
- దూరవిద్యలో డిగ్రీ, ఆపై సివిల్స్‌పై గురి
- నాలుగో ప్రయత్నంలో విజయం
- కష్టపడితేనే విజయం సాధ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

ఆమె చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. ఆ ప్రతిభే ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు తెచ్చిపెట్టింది. అయితే అదే సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయింది. ఊహించని పరిణామంతో రెండేళ్లు మానసికంగా కుంగిపోయింది. కానీ తల్లిదండ్రులు, సన్నిహితుల ప్రోత్సాహంతో దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేసింది. ఆ తరువాత సివిల్స్ లక్ష్యంగా పెట్టుకుని, నాలుగో విడతలో సాధించింది.

యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2023 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో నగర పరిధిలోని కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతానికి చెందిన వేములపాటి హనిత 887 ర్యాంకు సాధించారు. మూడుసార్లు మెయిన్స్ వరకే పరిమితమైన హనిత...పట్టువిడవక నాలుగో ప్రయత్నంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడిన హనిత సివిల్స్ బాట పట్టడానికి గల కారణాలు, ఆ ప్రయత్నంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అధిగమించేందుకు పడిన శ్రమ వంటి వాటిని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

అనుకోకుండా సివిల్స్ వైపు ప్రయాణం..

అమ్మ ఇందిర ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నాన్న వేములపాటి రాఘవేంద్రరావు ... మిగతా 4వ పేజీలో



నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర జీవీఎంసీకి వెళ్లే రోడ్డు

మండిన నగరం

ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడెక్కిన వాతావరణం

- మరోవైపు వడగాడ్పులు
- ఠారెత్తిన జనం
- ఎయిర్‌పోర్టులో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఏప్రిల్ నెలకు సంబంధించి ఇదే రికార్డు
- 2014 ఏప్రిల్ 1న 40.6 డిగ్రీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, వడగాడ్పులతో మంగళవారం నగరం మండిపోయింది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వేడి వాతావరణం కొనసాగింది. విశాఖ ఎయిర్‌పోర్టులో 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వాల్తేరులో 37.3 డిగ్రీలు నమోదైంది. ఏప్రిల్ నెలకు సంబంధించి వాతావరణ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం 2014 ఏప్రిల్ ఒకటో తేదీన ఎయిర్‌పోర్టులో 40.6 డిగ్రీలు నమోదైంది. వాల్తేరులో 1979 ఏప్రిల్ 21న 36.5 డిగ్రీలు నమోదైంది. ఆ రికార్డులను బ్రేక్ చేస్తూ మంగళవారం గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధ, గురువారాల్లో కూడా నగరంలో వేడి వాతావరణం, గాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.



మారని యూసీడీ తీరు

అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కార్యక్రమాలు

- ముగ్గురు సీఓలను సస్పెండ్ చేసినా అదే వైఖరి
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు
- ఆర్పీలతో తరచూ సమావేశాలు ఏర్పాటుచేస్తున్న సీఓలు
- ఓటర్ కార్డుల వివరాలు సేకరణ
- సమాచారం ఉన్నా పట్టించుకోని అధికారులు



తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి ఆలయం పక్కన అంగన్వాడీ భవనంలో ఆర్పీలతో సోమవారం సమావేశమైన సీఓ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన ఆదేశాలను జీవీఎంసీ యూసీడీ అధికారులు, సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థికి మద్దతుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ముగ్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్లను జిల్లా కలెక్టర్ రెండు రోజుల కిందట సస్పెండ్ చేశారు. ఏపీడీకి షోకాజ్ నోటీసు జారీచేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించారు. అయినప్పటికీ కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది తమ వైఖరి మార్చుకోకుండా అధికార పార్టీకి మద్దతుగా మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో 33,174 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 3.4 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు, పథకాలు, రుణాలు అందేలా సహకరించేందుకు 1,080 మంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) పనిచేస్తున్నారు. మహిళా సంఘంలోని ఒక్కో సభ్యురాలి ఇంట్లో సగటున మూడు ఓట్లు లెక్కేసుకున్నా...పది లక్షల ఓట్లు స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలవే ఉంటాయి. వీటిని గంపగుత్తగా రాబట్టుకుంటే తమ విజయావకాశాలు మెరుగుపడతాయని అధికార పార్టీ అభ్యర్థులు భావిస్తున్నారు.

గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఆ పార్టీ నేతలతో బాగా పరిచయాలు ఏర్పడ్డాయి. పైగా ఏదో ఒకరకంగా అధికార పార్టీ నేతల నుంచి సాయం పొందివుండడంతో కొంతమంది అధికారులు, సిబ్బంది వారిపట్ల సానుకూల దృక్పథంతో ఉంటున్నారు. దీన్ని ఎన్నికల్లో తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార పార్టీ నేతలు యత్నిస్తున్నారు. ప్రధానంగా జీవీఎంసీ యూసీడీ అధికారులు, సిబ్బందితో మహిళా సంఘాల సభ్యులకు బాగా పరిచయం ఉంటుంది కాబట్టి, వారి ద్వారా వైసీపీ నేతలు, అభ్యర్థులు ప్రయత్నాలు ... మిగతా 4వ పేజీలో

సైబర్‌క్రైమ్‌కు హాట్‌స్పాట్‌గా విశాఖ

మూడేళ్లలో 12 వేలకుపైగా బాధితులు

- పోగొట్టుకున్న సొమ్ము రూ.85 కోట్లు
- అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట
- సీపీ రవిశంకర్‌అయ్యన్నార్



హ్యాండ్‌బుక్‌ని ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్‌అయ్యన్నార్

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో సైబర్ నేరాలు ఇదేమాదిరిగా నమోదైతే భవిష్యత్తులో సైబర్ క్రైమ్‌కు హాట్‌స్పాట్‌గా మారే ప్రమాదం ఉందని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆందోళన వ్యక్తంచేశారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ... మిగతా 4వ పేజీలో

విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- భర్త మృతి...భార్యకు తీవ్ర గాయాలు
- గర్భవతిగా ఉన్న ఆమెను పెద్దమ్మ ఆశీర్వాదం కోసం తీసుకుని వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న బైక్‌ను ఢీకొనడంతో మరొకరు



సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన నాగరాజేశ్వరి (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన ఆమె భర్త బత్తిన సంతోష్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, ఏప్రిల్ 16:

పెందుర్తిలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాతపడ్డారు. వ్యాపార పనులపై ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పెందుర్తి జంక్షన్‌లో లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలను వ్యాన్ ఢీకొనడంతో భర్త మృతిచెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

పెందుర్తి సమీప దొగ్గవానిపాలేనికి చెందిన బత్తిన సంతోష్ (26), నాగరాజేశ్వరి (20) దంపతులు. వీరికి రెండేళ్ల కిందట వివాహం జరిగింది. గర్భవతిగా వున్న నాగరాజేశ్వరికి ఆమె పెద్దమ్మ ఆశీర్వాదం ఇప్పించేందుకు సంతోష్ మంగళవారం ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం తీసుకువెళ్లాడు. బంధువులతో ఆనందంగా గడిపి, సాయంత్రం తిరుగుపయనమయ్యారు. వారి ద్విచక్ర వాహనాన్ని జాతీయ రహదారిపై సరిపల్లి బైపాస్ బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ బైక్ పైనుంచి ఎగిరి కిందకు పడిపోయారు. ప్రమాదంలో సంతోష్ తలకు బలమైన గాయమవడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కుడివైపు డివైడర్ పక్కన పడిన నాగరాజేశ్వరి రెండు కాళ్లు విరిగిపోయాయి. కళ్లెదుటే భర్త మృతిచెందడంతో ఆమె రోదిస్తూ కుప్పకూలింది. సంతోష్ పెందుర్తిలోని ఓ వైన్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజేశ్వరిని, సంతోష్ మృతదేహాన్ని పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

సిగ్నల్ పాయింట్ వద్ద లారీ ఢీకొని...



గొర్లె సన్నిబాబు (ఫైల్ ఫొటో)

పెందుర్తి జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పాత పెందుర్తికి చెందిన గొర్లె సన్నిబాబు (55) ద్విచక్ర వాహనంపై పెందుర్తి వచ్చాడు. సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న అతడిని అతివేగంగా వచ్చిన లారీ ... మిగతా 4వ పేజీలో

ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ఠ చర్యలు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఏప్రిల్ 16: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున స్పష్టంచేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల కోడ్ అమలు , ఓటర్ల నమోదు, నామినేషన్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మా ట్లాడుతూ, సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 361 ఫిర్యాదులు అందగా, వీటిలో 266 పరిష్కరించినట్టు చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన 55 మంది వలంటీర్లు, ఏడు గురు ఒప్పంద ఉద్యోగులు, నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. వీరిలో 26 మందిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్టు స్పష్టంచేశారు. వివిధ రాజకీయ పార్టీలపై 30 ఎఫ్ఐలు నమోదు చేసినట్టు వివరించారు. ఇందులో వైసీపీపై 7, టీడీపీపై 6, జనసేనకు సంబంధించి నాలుగు, ఇతరులపై 13 ఉన్నట్టు చెప్పారు. వివిధ చోట్ల తనిఖీల్లో ఇప్పటివరకు వస్తు, ధన రూపేణా రూ. 5.02 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. కమిటీ ద్వారా సరైన పత్రాలు చూపిన కొందరికి నగదు తిరిగి అందజేసినట్టు వివరించారు. సాధారణ వ్యక్తులు రశీదులు, పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకువెళ్లరాదన్నారు. స మావేశంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పక్కాగా ఏర్పాట్లు: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యరుల నామినేషన్లు దాఖ లకు జ్ఞానాపురంలోని జీ వీఎంసీ జోన్-5 కార్యా లయంలో అన్ని ఏ ర్పాట్లుచేసినట్లు పశ్చి మ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. మంగళవారం నామినేషన్ల స్వీకరణ, హోమ్ ఓటింగ్ తదితర అంశాలపై నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్స్, బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో నామినేషన్ల స్వీకరణలో విధివిధానాలను వివరించారు. సందేహాలు ఉంటే ఆర్‌ఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. పోలింగ్ షెడ్యూల్ వివరించారు. వృద్ధులు ఓటువేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. సమావేశంలో ములగాడ, గోపాలపట్నం తహసీల్దార్లు శ్రీనివాస్ మిశ్రా, విజయభాస్కర్, జోన్-5, జోన్-8 జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి. కృష్ణ,హైమావతి తదితరులు పాల్గొన్నారు

యూపీఎస్సీ పరీక్షలు పక్కాగానిర్వహించాలి:ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌కుమార్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 16: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను, లైజన్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులకు లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తపాలా శాఖ పర్యవేక్షకులు గజేంద్రకుమార్, పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కొత్తగా ఏడు బస్సులు



కొత్త ఆల్ట్రాడీలక్స్ బస్సు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 16: పీటీడీ విశాఖ రీజియన్‌కు ఏడు కొత్త బస్సులు వచ్చాయి. ఇందులో ఐదు సూపర్ లగ్జరీ సర్వీసులు, రెండు ఆల్ట్రా డీలక్స్ బస్సులున్నాయి. మంగళవారం సాయంత్రం వీటికి ట్రయిల్ రన్ పూర్తిచేశారు. ప్రధాన రూట్ల ఆక్యుపెన్సీ రేషియో పరిశీలించిన తరువాత బుధవారం నుంచి విశాఖ-ఇచ్ఛాపురం మధ్య రెండు ఆల్ట్రాడీలక్స్ సర్వీసులు, విశాఖ-శ్రీకాకుళం మధ్య నాన్‌స్టాప్‌లుగా మిగిలిన బస్సులు నడపాలని నిర్ణయించారు.

ఎన్నికల్లో అంకితభావంతో పనిచేయాలి: జేసీ

మహారాణిపేట, ఏప్రిల్ 16: ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులు అంకిత భావంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూరి అశోక్ అన్నారు. ఎన్నికల సన్నద్ధతపై కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

బీసీ, ఎస్సీ, మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం

» దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ



వంశీకృష్ణ కు స్వాగతం పలుకుతున్న మహిళలు



కరపత్రాలు అందిస్తున్న వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 16: బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని దక్షిణ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం గ్రేటర్ 36వ వార్డు రెల్లివీధి, ఆశీపావీధి, కాకరవీధిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ముస్లింలు, ఎస్సీ వర్గాలనుంచి ఆయనకు విశేషం ఆదరణ లభించింది. వైసీపీ ఎస్సీలు, మైనార్టీలతో బీసీలను వంచించించిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కృషి చేయాలని వంశీకృష్ణ వారిని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఆయా సంఘాల నేతలు, స్థానిక పెద్దలు, కుల సంఘాల నాయకులు వంశీకృష్ణకు భరోసా ఇచ్చారు. పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన పార్టీల అభ్యర్థులకు పూర్తి సహకారం అందిస్తామంటూ హామీ ఇచ్చారు. వంశీ కృష్ణతో కలసి పలు వీధుల్లో పర్యటించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా వంశీ కృష్ణ గాజు గ్లాసుకు ఓటేయాలంటూ స్థానికులను జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. ప్రతి వీధిలో వంశీ కృష్ణ ప్రచారానికి ప్రజలనుంచి సానుకూల స్పందన కనిపించింది. చిరు వ్యాపారులను కలసి అభ్యర్థి వంశీ కృష్ణ ఓటు వేయాలని కోరారు. స్థానిక ప్రాంతాలకు చెందిన కూటమి కార్యకర్తలు, యువకులు ఈ ప్రచారంలో డ్యాన్స్‌లతో హోరెత్తించారు. టీడీపీ సీనియర్ నాయకులు చిన్న రహమాన్, మహిళా నాయకురాలు కేధారి లక్ష్మి, జనసేన నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా చాప్లిన్ జయంతి

సీతమ్మధార, ఏప్రిల్ 16 : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హాస్య నటుడు, దర్శకుడు, నిర్మాత చార్లీ చాప్లిన్ 135వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చాప్లిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ చాప్లిన్ జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా ఆ యన జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, ఇమంది ఈశ్వరరావు, బి.న్నారావు, హుస్సేన్, బాబూరావు రెడ్డి, బాబ్జీ పాల్గొన్నారు.

వైసీపీ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలి

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు



విష్ణుకుమార్‌రాజుకు గజమాల వేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలంటే కూట మి అభ్యర్థులను గెలిపించాలని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు విష్ణుకుమార్‌రాజు గజమాల వేసి సత్కరించారు. అనంతరం ఆయన ఇం టింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుతం హయాంలో గత ఐదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఈస్థితిలో అటువంటి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా ఐక్యంగా కంకణం కట్టుకోవాలని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం నిత్యాసవర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, సీతమ్మధార మండల బీజేపీ అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, నాయకులు ఎన్.రఘునాథ్, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 16: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06565 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.35 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మల్దా చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50కు మల్దాలో బయలుదేరి మర్నాడు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.00కు బెంగళూరు చేరుతుంది. 07221 నంబరు గల రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారం ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.25 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారం మధ్యాహ్నం 12.20 కు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 3.20కు దువ్వాడ చేరుతుంది.

కాపులంతా కూటమి వైపు నిలవాలి

» కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్



సంఘీభావం తెలుపుతున్న కాపు సంఘాల ప్రతినిధులు

సీతంపేట, ఏప్రిల్ 16: అన్ని విధాలా వంచించిన వైసీపీ వైపు కాకుండా, కాపులంతా ఈ ఎన్నికల్లో కూటమి వైపు నిలబడాలని కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాపునేతలంతా కూటమి అభ్యర్థులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ 5 శాతం అమలుకాక, కాపు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాపులకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. ఈస్థితిలో రాష్ట్రం బాగుండాలంటే దూరదృష్టి ఉన్న చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. జగన్మోహన్ రెడ్డి కాపులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఎక్కువగా కౌలు రైతుల ఉన్న కాపు కులాన్ని అణగదొక్కారన్నారు. తమ సామాజిక వర్గం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఈడబ్ల్యూసీలో 5 శాతం రిజర్వేషన్ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రబాబుతోనే సాధ్యమైందన్నారు. పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ వైసీపీ పూర్తిగా అమలు చేయక విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 పైగా కాపు భవనాలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకి చెందిందన్నారు. విదేశీ విద్యను మూడేళ్లుగా పరిగణనలోకి తీసుకోకుండా మోసం చేశారన్నారు. ఈస్థితిలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారంతా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో తుమ్మల సత్యారావు, ప్రగడ చిన నాగేశ్వరరావు, కర్రి వెంకటరమణ, సిరిసిపల్లి రమణ, మార్కినీడు మణికంఠ, అన్నం వెంకటరావు ఉన్నారు.

మారని యూసీడీ తీరు

... 3వ పేజీ తరువాయి

ముమ్మరం చేశారు. ముందుగా తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే యూసీడీ విభాగం అధికారులు, సిబ్బందిని నేతలు కలుస్తున్నారు. వారికి తాయిలాలు అందజేసి తమకు అనుకూలంగా మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేయిస్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్టు వినాలని ఉన్నతాధికారులు సైతం ఆదేశిస్తుండడంతో యూసీడీ విభాగంలోని సీఓలు, ఆర్పీలు అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా తమ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ మేరకు ఆర్పీలంతా తమ పరిధిలోని సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యుల ఓటర్లు కార్డు, రేషన్ కార్డులను తీసుకుంటున్నారు. ఆ వివరాలను తమ ఉన్నతాధికారుల ద్వారా అధికార పార్టీ అభ్యర్థులకు పంపిస్తున్నారు. తమకు అందిన జాబితా ప్రకారం ఓటుకు రూ.వెయ్యి చొప్పున లెక్కేసి, కార్డులు ఇచ్చినవారి ఇళ్లకు వైసీపీ వార్డు స్థాయి నేత మనుషులతోపాటు అభ్యర్థి తరఫున నియమించుకున్న మనిషి వెళ్లి అందజేసి తమ నాయకుడికి ఓటెయ్యాలని కోరుతున్నారు. ఇదే తరహాలో తూర్పు నియోజకవర్గ వైసీపీ నేత కార్యాలయానికి వెళ్లి, ఆయన విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారనే అభియోగంపై ముగ్గురు సీఓలను జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున రెండు రోజుల కిందట సస్పెండ్ చేశారు. బాధ్యుడైన ఏపీడీకి ఛార్జ్‌మెమో ఇవ్వడంతోపాటు ఎన్నికల విధుల నుంచి తొలగించాలంటూ జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. వీరితోపాటు 20 మంది ఆర్పీలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించడం యూసీడీ అధికారులు, సిబ్బందిలో గుబులు రేపింది. ఇకనైనా యూసీడీ సిబ్బంది తమ పరిధిలోనే ఉండి, వైసీపీ నేతలకు మద్దతుగా కార్యక్రమాలు నిలిపేస్తారని అంతా ఆశించారు. కానీ అలాంటి వాటిని తాము పట్టించుకునే ప్రసక్తే లేదన్నట్టు కొంతమంది వ్యవహరిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా ఉత్తర నియోజకవర్గం పరిధిలోని తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న వార్డు సచివాలయంలో ఒక సీఓ తన పరిధిలోని ఆర్పీలతో సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఇంత జరిగినా వీరి వైఖరిలో మార్పురాలేదంటూ జీవీఎంసీ అధికారులు సైతం నిట్టూరుస్తున్నారు. ఆర్పీలు, సీఓల తీరుపై జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్ఫూర్తిదాయకం.. హనిత విజయం

... 3వ పేజీ తరువాయి

ఇండియన్ రైల్వేలో సీనియర్ ఇన్‌స్పెక్టర్. ప్రాథమిక విద్యాభ్యాసం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు టింపనీలో సాగింది. ఇంటర్మీడియట్ ఫిడ్జ్‌లో పూర్తిచేశా. ఇంటర్ తరువాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్‌లో చేరా. అయితే, ఆ సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయా. 2013లో అత్యంత అరుదుగా కనిపించే వెన్నముక ఇన్‌ఫెక్షన్ బారినపడ్డా. ఆ ఇన్‌ఫెక్షన్ వల్ల నాలుగు గంటల్లోనే పెరాలసిస్ వచ్చింది. కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. అనేక ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రెండేళ్లపాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. తల్లిదండ్రులు సహకారం, గురువు రామదూతస్వామి ప్రోత్సాహం, ఆశీస్సులతో మళ్లీ సాధారణ స్థితికి రాగలిగాను. ఆయన సూచనతోనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తరువాత సివిల్స్ దిశగా ప్రయాణం ప్రారంభించా. 2020లో తొలిసారి అటెమ్ట్ చేశా. మూడు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్ క్లియర్ చేశా. మెయిన్స్‌లో విఫలమయ్యాను. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్, ఇంటర్వ్యూ క్లియర్ చేయడంతోపాటు మంచి ర్యాంకు సాధించాను. ఈ ర్యాంకు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. గత ఏడాది గ్రూప్-1 కూడా అటెమ్ట్ చేశాను. ఏవో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం నగర పరిధిలోని మానసిక ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ పనిచేస్తుండగానే సివిల్స్ ర్యాంకు వచ్చింది.

ఇంట్లో ప్రిపరేషన్

సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఇంట్లోనే ప్రిపేరయ్యాను. మెటీరియల్ సొంతంగా తయారు చేసుకున్నాను. మెయిన్స్‌కు మాత్రం సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీతోపాటు పలుచోట్ల తీసుకున్న శిక్షణ, గైడెన్స్ ఎంతగానో ఉపకరించాయి. మొదట్లో ప్రతిరోజూ ఎనిమిది గంటలు చదవడానికి కేటాయించేదాన్ని. ఆ తరువాత క్రమంగా ఆరు గంటలు సమయాన్ని కేటాయించాను. గైడెన్స్ లేకపోవడంతో తొలి మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యాను. మూడుసార్లు ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో వాటిని సరిదిద్దుకుని నాలుగో ప్రయత్నంలో విజయం సాధించాను. ఇందుకు ఫ్యాకల్టీ, తల్లిదండ్రులు అందించిన సహకారం చాలా గొప్పది.

నిరాశ వద్దు..మంచి రోజులు ఉంటాయి..

ఎటువంటి పరిస్థితుల్లోనూ నిరాశకు గురికావద్దు. చీకటి వెంటే వెలుగు ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలి. దీనికి నేనే ఒక ఉదాహరణ. ఇక జీవితం లేదు అనుకుని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిన నేను..మళ్లీ ఈరోజు గెలుపుబాట పట్టాను. నిరాశకు లోనైన ప్రతి ఒక్కరూ ఆశతో రేపటి కోసం చూడాలి. మంచి రోజులుతప్పక వస్తాయి. అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునేందుకు అంకిత భావంతో కృషిచేయాలి. అప్పుడే గెలుపుబాట పడతాం. మనమేంటో నిరూపించుకునే అవకాశం ప్రతి ఒక్కరికీ వస్తుంది. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూవిడిచిపెట్టకూడదు. రెండేళ్లపాటు నేను నరకాన్ని అనుభవించాను.అప్పటివరకు ఆనందంగా సాగిపోయిన జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. తల్లిదండ్రులు కూడా తీవ్రంగా వేదన అనుభవించారు. కానీ, నేను బాధపడకూడదని వాటిని బయటపడనీ యలేదు. ఈ జర్నీలో అమ్మా, నాన్న ప్రోత్సాహం,వారి సహకారం మరువలేనిది. సివిల్స్ అంటే చాలా పోటీ ఉంటుంది.ఎంతపోటీఉన్నాప్రణాళికప్రకారం ముందుకువెళితే విజయం సాధ్యమే.

ఫ్లైఓవర్స్ ఏవీ?, ఎక్కడ??

... 3వ పేజీ తరువాయి

సగటున ఒకరు ప్రాణాలు కోల్పోతుంటే ముగ్గురు క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఏటేటా వీటి సంఖ్యతోపాటు మృతుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. నగరవాసులతోపాటు పోలీస్, జీవీఎంసీ అధికారులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడం, జనాభా పెరుగుతుండడంతో 2030 నాటికి వాహనాల సంఖ్య 25 లక్షలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నాలుగు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, ఒకచోట ఆర్‌ఓబీ, మరోచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు వీలుగా గాజువాక, సత్యం కూడలి/మద్దిలపాలెం, హనుమంతవాక, పీఎం పాలెం కార్‌షెడ్ కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని ప్రతిపాదించారు. వీటితోపాటు గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదన ఎప్పటినుంచో ఉన్నందున దాన్ని కూడా ప్రారంభించి, పూర్తిచేస్తామని ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కొత్తలో వైసీపీ నేతలు హామీలు గుప్పించారు. అలాగే మధురవాడలోని చంద్రంపాలెం వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు అవకాశం లేదు. దీంతో జాతీయ రహదారి పైనుంచే అటు నుంచి, ఇటు నుంచి అటు దాటుతున్నారు. దీనివల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటుండడంతో పాదచారులు తరచూ మృత్యువాతపడడం, గాయపడడం జరుగుతోంది. దీంతో అక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. వీటిలో కొత్తపాలెం వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం కోసం అధ్యయనం చేసి ఫీజుబిలిటీ నివేదిక ఇవ్వడానికి ఆసక్తి, అర్హత, అనుభవం కలిగిన ఏజెన్సీల నుంచి 2020 జనవరి 27న జీవీఎంసీ అధికారులు ఆర్ఎఫ్‌పీ పిలిచారు. ఎంపికైన ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత నాలుగు నెలల్లోగా డీపీఆర్‌ను అందజేయాలని, ఆ తర్వాత ఆ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడంతోపాటు నగరంలో నిర్మించతలపెట్టిన నాలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణంపై ముందుకువెళ్లేందుకు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో వివరించారు. నాలుగేళ్లు గడిచిపోయినా ఇంతవరకూ వైసీపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనపై ఒక్క అడుగు కూడా ముందుకువేయలేకపోయింది. కొత్తపాలెం ఆర్ఎఫ్‌పీపై కూడా ఇంతవరకూ అతీగతీలేదు. అలాగే చంద్రంపాలెం వద్ద జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మూడు నెలల కిందట అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ముందుకుసాగలేదు. ఐదేళ్ల పాలనలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం నగర అభివృద్ధిపై వైసీపీకి గల చిత్తశుద్ధికి తెలియజేస్తోందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పెందుర్తిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

వైసీపీ మాజీ నేత వెంకట నరసింహారావు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 16: రానున్న ఎన్నికల్లో పెందుర్తి నుంచి వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీలో సీనియర్ నేతలకు గుర్తింపు లేదని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.ఈ నెల 19న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తానన్నారు.

గంజాయి విక్రయదారుల మధ్య కొట్లాట

» ఏడుగురు అరెస్టు.. 22 కేజీల గంజాయి స్వాధీనం

సీతంపేట, ఏప్రిల్ 16: అక్రమంగా గంజాయి తరలింపు, విక్రయం, ఈ గ్రూపుల మధ్య దాడులకు సంబంధించిన కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాలుగో పట్టణ పోలీసు సీఐ విజయ్‌కుమార్ అందించిన వివరాలివి.. ఈనెల 14వ తేది రాత్రి కైలాసపురం సాలిగ్రామపురం వెంకటేశ్వర స్వామి ఆ లయం మెట్ల వద్దకొంత మంది గుమిగూడి గొడవ పడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందిందింది. దీంతో సీఐ విజయ్‌కుబమార్, ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. గొడవ పడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురుపరారయ్యారు. ఈ క్రమంలో రౌడీ షీటర్ పెద్దిశెట్టి రూపేశ్‌ను గుర్తించి విచారణ చేపట్టారు. దీంతో వ్యసనాలకు బానిసైన అతను డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితులు అయిన కర్రి నవీన్ శ్రీనివాస్, చింతలపూడి శ్రీను అలియాస్ డాన్ శ్రీను, బత్తుల నారాయణరావు, గులివిందు శ్రీనువాస్‌లతో కలిసి అరకు, పాడేరు గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడ కిలో గంజాయి రూ.2 వేల చొప్పున కొనుగోలుచేసి నగరానికి తీసుకువచ్చి అమ్మకాలు సాగించారు. ఈ క్రమంలో సాలిగ్రామపురం సింహగిరి కాలనీకి చెందిన కుప్పు సాయి చైతన్య కుమార్, నీరజ్ సాయి వినయ్‌లకు వీరిద్దరితో పాటు మరో ముగ్గురికి గంజాయి ఈ వి క్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపార లావాదేవీల్లో తేడా వచ్చి ఈనెల 14వతేదీన పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి మొత్తం 22 కిలోల గంజాయిస్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు కోసం గాలిస్తున్నారు.

వలంటీర్లు లేకుంటే గెలవలేరా?

» 15 మందితో రాజీనామా చేయించిన ఉషశ్రీ, కేకే రాజు



రాజీనామా చేశాక కేకే రాజుని కలిసిన వలంటీర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు వార్డు వలంటీర్ల సాయం లేకపోతే ఈ ఎన్నికల్లో విజయం సాధించలేమని భయపడుతున్నారు. ఇప్పటివరకు వారితో అన్ని రకాల పనులు చేయించుకుని, ఎన్నికల సమయంలో దూరంగా పెట్టాలంటే వారికి మనసు ఒప్పడం లేదు. వారు ఉంటే తప్ప విజయం దక్కదని భావిస్తున్న పలువురు అభ్యర్థులు వలంటీర్లను నయానో, భయానో ఒప్పించి రాజీనామాలు చేయిస్తున్నారు. ఇప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి కేకే రాజు అదే పనిచేశారు. ఆయన వర్గంలో ముఖ్య నాయకురాలిగా ఉన్న 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ, తన ప్రాంతంలో పనిచేస్తున్న 15 మంది వలంటీర్లతో మంగళవారం ఆ ఉద్యోగాలకు రాజీనామా చేయించారు. వెంటనే వారిని కేకే రాజు వద్దకు తీసుకెళ్లారు. వారితో మళ్లీ జగన్‌ని సీఎంగా గెలిపించడానికి, కేకే రాజు విజయం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే వలంటీర్లకు మళ్లీ నియామకపు ఉత్తర్వులు ఇస్తామని, ఇంకా మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఈ రెండు నెలలు రాజీనామా చేసి పనిచేసినందుకు వారికి భారీగానే మొత్తాలు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. వాటికి ఆశపడే పలువురు రాజీనామా చేస్తున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

సైబర్‌క్రైమ్‌కు హాట్‌స్పాట్‌గా విశాఖ

... 3వ పేజీ తరువాయి

ఏర్పాటుచేశారు. గత మూడేళ్లలో నగరంలో 12 వేల మందికిపైగా సైబర్ మోసాలకు గురయ్యారన్నారు. వీరంతా రూ.85 కోట్లు వరకూ పోగొట్టుకున్నారని, అందులో కేవలం రూ.18 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగామన్నారు. సైబర్‌క్రైమ్ బారినపడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, దీన్ని నియంత్రించేందుకు సైబర్ మోసాలు జరిగే తీరుతెన్నులపైనా, మోసానికి గురైతే తక్షణం చేయాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందన్నారు. సైబర్ మోసాలు జరిగే విధానం, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన నాలుగు వీడియోలతోపాటు హ్యాండ్‌బుక్, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. హ్యాండ్‌బుక్‌ను కాలేజీలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో అందుబాటులో ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రస్తుతం కొరియర్ సర్వీసు, గేమ్ టాస్క్, ట్రేడింగ్, లోన్ యాప్‌ల పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్‌చేయాలన్నారు. దీనివల్ల తక్షణం స్పందించి బ్యాంకు నుంచి నగదు ఏఏ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయిందో గుర్తించి ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫెడెక్స్ కొరియర్ పేరుతో 2023, 2024లో ఇప్పటివరకూ 12 మంది మోసానికి గురై రూ.1.08 కోట్లు పోగొట్టుకున్నారన్నారు. గేమ్‌టాస్క్ పేరుతో 2022, 2023, 2024లో ఇంతవరకూ 213 మంది మోసానికి గురై రూ.18.42 కోట్లు నష్టపోయారన్నారు. లోన్‌యాప్ పేరుతో జరిగే మోసాల్లో 2022, 2023 సంవత్సరాల్లో 21 మంది రూ.77 లక్షలు నష్టపోయారన్నారు. నకిలీ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్న పది మందిని అరెస్టు చేశామన్నారు. గత నాలుగేళ్లలో జరిగిన సైబర్ నేరాలకు సంబంధించి ఎన్‌సీఆర్‌బీ, సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలు ప్రకారం నిందితులుగా ఉన్న నగరానికి చెందిన 126 మందిని గుర్తించామని, వారిలో 36 మందిని అదుపులోకి తీసుకుని వారి పాత్రపై విచారణ చేస్తున్నామన్నారు. సైబర్‌క్రైమ్‌కు పాల్పడుతున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారు, నకిలీ ధ్రువపత్రాలతో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటుండడం వల్ల వారిని గుర్తించడం క్లిష్టతరంగా మారుతోందన్నారు. ఈ సమావేశంలో సైబర్‌క్రైమ్ సీఐలు కె.భవానీప్రసాద్, లక్ష్మణరావు, ఎస్ఐ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం

... 3వ పేజీ తరువాయి

ఢీకొట్టింది. దీంతో అతడు బైక్‌తో సహా లారీ కిందకు వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన సన్నిబాబును 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. సన్నిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీఐ ఎల్.రామకృష్ణ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గడ్డితో సహా ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమవుతున్న దృశ్యం

ఎండు గడ్డితో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం

అగనంపూడి, ఏప్రిల్ 16: విద్యుత్ తీగలు తగలడంతో ఎండు గడ్డి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది. మంటలను గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ వెనక ఉన్న ట్రాలీని వేరు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన ఫార్మాసిటీ పునరావాస కాలనీ సమీపంలోని గోన్నవానిపాలెంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని ప్రాంతం నుంచి గడ్డి లోడ్‌తో ట్రాక్టర్ గోన్నవానిపాలేనికి బయలుదేరింది. ఫార్మాసిటీ ప్రాంతానికి వచ్చేసరికి ప్రధాన రోడ్డుపై గల విద్యుత్ తీగలు గడ్డిని తాకడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్ వెంటనే వాహనాన్ని నిలిపివేసి ట్రాక్టర్ వెనక ఉన్న ట్రాలీని వేరు చేసి స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. గడ్డితో సహ ట్రాలీ మంటల్లో కాలి బూడిదైంది. మంటలు టైర్లకు అంటుకోవడంతో పెద్ద శబ్దంతో పేలిపోయాయి.

88వ వార్డులో అమర్‌నాథ్ ప్రచారం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 16: జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడలో, 86వ వార్డు వుడానగర్‌లో మంగళవారం మంత్రి, వైసీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీవీఎన్ఎం రాజా, దామా సుబ్బారావు, వి.రామచంద్రరాజు, బి.శ్రీనివాసరాజు, మెడికల్ బాబు, శ్రీనివాస్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండుగ



అగనంపూడి, ఏప్రిల్ 16: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పరదేశమ్మ అమ్మవారి అనుపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని కొత్త వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పరదేశమ్మను దర్శించుకున్నారు. సాయంత్రం పురవీధుల్లో ఘటాలను ఊరేగించాక అమ్మవారి అనుపోత్సవాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చిత్తా గణేశ్, చిత్తా కనకరాజు, జి.రాజు, దొరయ్యనాయుడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మురళీధరరెడ్డికి 'లయన్స్' గ్రోత్ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న మురళీధరరెడ్డి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 16: లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం అధ్యక్షుడు ఎ.మురళీధరరెడ్డి మెంబర్‌షిప్ గ్రోత్ ఎక్సలెన్స్ అవార్డును (2023-24) అందుకున్నారు. నగరంలో ఇటీవల జరిగిన 43వ జిల్లా వార్షిక అంతర్జాతీయ సమావేశంలో గవర్నర్ ఎ.గోపాలరావు చేతుల మీదగా ప్రశంసాపత్రం, షీల్డును ఆయన అందుకున్నారు. ప్రముఖులు విజయకుమార్, సుబ్బరాజు, ప్రసాద్, ఎ.సూర్యనారాయణ, పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 26, క్యారెట్ 30, దొండకాయలు 20, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 155, బరబటి 26, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 110, పొటల్స్ 68, కీరదోస 20, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడి కాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	108
ఫారం ధర	--	128
విత్ స్కిన్	--	226
స్కిన్‌లెస్	--	236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ8లో..

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి

తెలుగుదేశం పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీభరత్

గాజువాక, ఏప్రిల్ 16: ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. ఇక్కడి జగ్గు జంక్షన్ వద్ద గాజువాక క్లబ్ సభ్యులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన గాజువాక నియోజక వర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ గాజువాకలో మధ్య, దిగువ మధ్యతరగతి, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారన్నారు. గత ఐదేళ్ల కాలంలో వీరి జీవితాల్లో ఏ మార్పు లేకుండా పోయిందన్నారు. పేదలను శాశ్వతంగా పేదలుగా ఉంచేందుకు వైసీపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను మేధావులు, విద్యావంతులు ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటివరకు విశాఖ కర్మాగారం ప్రైవేటీకరణపై మాట్లాడని వైసీపీ ప్రభుత్వం నేడు కులం కార్డు పేరును బయటకు తీసుకువచ్చి క్రాస్ ఓటింగ్ కోసం పాకులాడుతుందని విమర్శించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు కార్మికుల సమస్యలతో పాటు అనేక సమస్యలున్నాయని, వీటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన పార్టీ గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గడసాల అప్పారావు, కోగంటి లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

సీతారాముల కల్యాణం కరపత్రాలు ఆవిష్కరణ

గాజువాక, ఏప్రిల్ 16: జీవీఎంసీ 72వ వార్డు పరిధి కర్నవానిపాలెం రామాలయంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామాలయంలో దర్శనాలు ప్రారంభమైన తర్వాత నిర్వహిస్తున్న తొలి శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవాలను మరింత వైభవంగా చేపడుతున్నామన్నారు. భక్తులకు అన్న సమారాధన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గొంతిన దేముడు, కన్నయ్య, పైడిరాజు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు


66వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక/పెదగంట్యాడ, ఏప్రిల్ 16: అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలతో రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన 66, 76 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అనకాపల్లిలో కనీస అభివృద్ధి పనులు చేపట్టని అమర్‌నాథ్ ఇక్కడకు వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఐదేళ్లుగా గాజువాక ప్రజలు అమర్‌కు కనిపించలేదని, ఇప్పుడు ఓట్ల కోసం వారి చుట్టూ తిరగడం సిగ్గుచేటన్నారు. నోట్ల కట్టలను కుమ్మరించి, అధికార బలాన్ని వినియోగించి ప్రజలను మళ్లీ మోసగించేందుకు వైసీపీ ప్రయత్నిస్తుందన్నారు. అధికార పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించవలసిందిగా పల్లా శ్రీనివాసరావు కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, నాయకులు గంధం శ్రీనివాసరావు పల్లా శ్రీనివాసరావు, ప్రసాదుల శ్రీనివాస్, ఎండీ.రఫీ, ముమ్మన మురళి, జీలకర్ర రమణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి టీడీపీ: 'పశ్చిమ' అభ్యర్థి గణబాబు


కార్మిక నాయకులతో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కార్మిక పక్షానే ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, అభ్యర్థి పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు అధ్యక్షతన శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక కుటుంబాలన్నీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు టీఎన్‌టీయూసీ ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు కాకి పోలిరెడ్డి, మజ్జి సోమేశ్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, పెద్దాడ భూలోకరాజు, మురళీ, జనసేన సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సింధియా జంక్షన్ నుంచి శ్రీహరిపురం వరకు గణబాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. మధ్యలో వాకర్స్‌ను కలిసి టీడీపీకి ఓట్లు వేయాలని ఆయన కోరారు.

విమాన్‌నగర్‌లో ప్రచారం..

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు విమాన్‌నగర్, కాకానీనగర్, కనకమహాలక్ష్మీనగర్ ప్రాంతాల్లో గణబాబు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబును సీఎంను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని గణబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, కూటమి నాయకులు ప్రకాశ్, నాయకులు దాడి పురుషోత్తమ్ రమేశ్, వి.శ్రీనివాస్, ప్రసాద్, అప్పారావు, పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 16: లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకున్న కేంద్రానికి అందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో కార్మికులతో పాటు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,160వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కపట నాటకాలు, పాదయాత్రల ద్వారా ప్రజలను మభ్య పెట్టాలని చూసిన పార్టీలకు ప్రజలే చరమగీతం పాడతారన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వాటాను గంగవరం పోర్టుకు విక్రయించడం వల్లే ఉక్కు కర్మాగారానికి ఇక్కట్లు అధికమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు ఛీత్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే ధ్యేయంగా కేంద్రం ముందుకు సాగుతుండడం దారుణమన్నారు. సమష్టి పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు రా మెటీరియల్ కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌కు వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 16: స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం రా మెటీరియల్ కొరత చాలా ఎక్కువగా ఉందని, దీనిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ మల్లికార్జునకు ఉక్కు కార్మిక సంఘ నాయకులు, అధికారుల సంఘం ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. గంగవరం పోర్టు కార్మికుల సమ్మె వల్ల స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన బొగ్గు రావడం లేదని, దీనివల్ల ప్లాంట్‌లో ఉత్పత్తి పూర్తిగా పడిపోయిందన్నారు. రా మెటీరియల్ లేక ఉత్పత్తి నిలిపివేసే పరిస్థితి వస్తే చాలా నష్టం వాటిల్లుతుందని, తదితర సమస్యలను విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, అయోధ్యరాం, రామచంద్రారవు, శ్రీనివాసరావు, రమణారెడ్డి, సురేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 16: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 32 సీట్ల భర్తీకి గాను ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 18 నుంచి 27 వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు విద్యాలయంలో అందుబాటులో ఉంటాయని, మే ఒకటిన స్కూల్ ప్రాంగణంలో లాటరీ నిర్వహించి సీట్లను భర్తీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్కూల్ వెబ్‌సైట్‌ను తిలకించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కారంలో తీవ్ర జాప్యం

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 16: కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతన సవరణపై గత, ప్రస్తుత గుర్తింపు యూనియన్లు కార్మికులను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. నూతన వేతనాల కోసం కార్మిక వర్గం ఏడేళ్లకు పైగా ఎదురుచూస్తుందన్నారు. కార్మికుల సమస్యలను ఉక్కు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, ఎస్ఏ నాయుడు, కొమ్ము ప్రసాద్, మొల్లి ఈశ్వరరావు, సీహెచ్ సుదర్శనరావు, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులో విద్యార్థుల ప్రతిభ

వేపగుంట, ఏప్రిల్ 16: నాయుడుతోట సాయిమాధవనగర్‌లోని శంకర్ ఫౌండేషన్‌లో నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సుల్లో విద్యార్థులు ఇంటర్ ఒకేషనల్ (ఆప్తాల్మిక్‌నర్స్, టెక్నీషియన్) కోర్సు ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచినట్టు మెడికల్ ఎడ్యుకేషనల్ హెడ్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుల ఫలితాల్లో ఇక్కడి చదువుతున్న విద్యార్థులు 95శాతం ఉత్తీర్ణత సాధించారు. తొలి సంవత్సరం చదువుతున్న పరీక్షలో డి.నాగశ్యామం 600కుగాను 534, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్.కె.వహిదా 1300కు గాను 1163 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి జీఎం కె.రాధాకృష్ణన్ అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్


ఆర్‌ఆర్ వెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి మాలతి

విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా విజయం వైసీపీదే..

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఏప్రిల్ 16: టీడీపీ. జనసేన, బీజేపీ ఎన్నికుట్రలు చేసినా వైసీపీని ఓడించలేరని, ప్రజలంతా తమ వెంటనే ఉన్నారని పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 61వ వార్డు వెంకన్నపాలెంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గత ఐదేళ్లగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రోడ్‌షోలోముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడిచేయడం అత్యంత దారుణమన్నారు. ఈ ఘటనలకు బాధ్యులైన వారికి శిక్ష తప్పదన్నారు. నియోజకవర్గంలో సమస్యలను దశలవారీగా తీర్చుతామన్నారు. స్థానిక యువతకు 75శాతం ఉపాధి లభించేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధతోపాటు, వైసీపీ నేతలు గొట్టుముక్కుల వెంకట సత్యనారాయణ రాజు (వాసు) పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశం

గోపాలపట్నం: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ ఫలాలు అందినట్టు ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో 52, 56, 57, 89, 90, 91, 92 వార్డుల నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘాల సభ్యులతో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. నాయీ బ్రాహణ సంఘ సభ్యులు ఆనంద్‌ను ఘనంగా సత్కరించి సంఘీభావం తెలిపారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ నేతలు పేడాడ రమణి కుమారి, ఉత్తంశెట్టి రేణుక గోపి పాల్గొన్నారు.

92వ వార్డులో ఆనంద్‌కుమార్ సతీమణి ప్రచారం

92వ వార్డు పరిధిలోని అజంతా పార్క్, ఆర్‌ఆర్ వెంకటాపురం ప్రాంతాల్లో ఆనంద్ కుమార్ సతీమణి మాలతి ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆనంద్ కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీరాణిను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ బీవీఎస్ఎస్ దేవి, నాయకులు పాల్గొన్నారు.

జనతాకాలనీలో..

మల్కాపురం/సింధియా: 61వ వార్డు జనతాకాలనీలో వైసీపీ అభ్యర్థి ఆనంద్ కుమార్ సోదరి , ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిళ్లా రమాకుమారి మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి ఖాయమని గుర్తించే... ప్రతిపక్ష కుట్రపార్టీలు కుట్రలు, కంతంత్రాలకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వైసీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు (వాసు), మూగి సూర్యనారాయణ, మళ్ల అప్పారావు, సన్నీయాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు. 40వ వార్డులోని ఏకేసీ కాలనీలో రమాకుమారి విస్తృతంగా ప్రచారం చేశారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు

అనాథలు, వృద్ధులకు కేశఖండన


వృద్ధులకు క్షవరం చేస్తున్న దృశ్యం

పెందుర్తి, ఏప్రిల్ 16: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులు, మానసిక వికలాంగులకు క్షవరం చేయించారు. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు హెయిర్ కటింగ్ చేయాలని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను తలపించి, మంగళవారం నాయీ బ్రాహ్మణులకు సెలవు కావడంతో వారిని సంప్రదించారు. సేవాభావంతో వారు అంగీకరించడంతో లయోలా వృద్ధాశ్రమంలో 120 మంది వృద్ధులు, అనాథ మహిళలు, మానసిక వికలాంగులకు కేశఖండన నిర్వహించారు. క్షురకులు బయ్యవరపు సురేశ్ నేతృత్వంలో పలువురు సాయంత్రం వరకు వృద్ధులకు గెడ్డం, తల క్షవరం చేశారు. వేసవిలో అనాథలకు ఉపశమనం కల్పించేలా ఈ సేవా కార్యక్రమం తలపెట్టినట్టు ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను, సభ్యుడు సిరిమల్లె గణేశ్ తెలిపారు. సహకరించిన నాయీ బ్రాహ్మణులను పలువురు ప్రశంసించారు.

నేడు ముత్యమాంబ తొలేళ్ల ఉత్సవం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రామాభ్యుదయ ప్రతినిధులు

ఆర్పీపేట,(కంచరపాలెం), ఏప్రిల్ 16 : కంచరపాలెం మెట్టు వద్దనున్న గవరకంచరపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ ముత్యమాంబ అమ్మవారి నవరాత్రి పండగ ఉత్సవాలు బుధవారంతో ప్రారంభంకానున్నాయి. బుధవారం అమ్మవారి తొలేళ్లు, గురువారం ప్రధాన పండగ జరగనున్నది. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గ్రామాభ్యుదయ సంఘం ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. అధ్యక్ష, కార్యదర్శి దాడి సూరి అప్పారావు, మళ్ల శంకర్రావు పండగకు ఏర్పాట్లను పూర్తిచేసినట్టు తెలిపారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

పెందుర్తి, ఏప్రిల్ 16: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా రాయాలయాలను ముస్తాబుచేశారు. సీతారాముల విగ్రహాలను శోభాయమయంగా అలంకరిస్తున్నారు. ఆలయాల ప్రాంగణాల్లో పెళ్లి పందిరిలు వేస్తున్నారు.

పెందుర్తిరూరల్: మండలంలోని చింతలఅగ్రహారం గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక రామాలయం వద్ద కల్యాణమూర్తులకు మంగళ స్నానాలు చేయించారు. మహిళలు కల్యాణమూర్తులపై సామూహికంగా తలంబ్రాలు పోసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణంపై నిరసన

ఎన్.ఎ.డి. జంక్షన్, ఏప్రిల్ 16: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ చివర కాలనీవద్ద ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం చేపడుతుండడంపై స్థానికులు మంగళవారం నిరసన వ్యక్తంచేశారు. ఇక్కడి శివారునున్న లైన్ వద్ద గెడ్డ భూమిని అక్రమించటమే కాకుండాట బిల్డర్ అపార్ట్‌మెంటుకు అనుకూలంగారోడ్డు నిర్మాణానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇక్కడి భారీ చెట్లును తొలగించి నిర్మాణానికి సిద్ధం కావడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

ములగాడ గ్రామంలో అల్లూఫ్లోరైడ్ అభివృద్ధి పనులు


సామాజిక భవనాన్ని ప్రారంభించిన కోరమాండల్ అధికారులు, గ్రామ పెద్దలు

మల్కాపురం, ఏప్రిల్ 16: సామాజిక సేవల్లో భాగంగా ములగాడ గ్రామంలో ఉన్న అల్లూఫ్లోరైడ్ కంపెనీ యజమాన్యం ములగాడ రెడ్డికాలనీలో సామాజిక భవనం, బోరు నిర్మించారు. ఇందులో అవసరమైన 100 కుర్చీలు, గోద్రెజ్ కబోర్డు, మోటార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కంపెనీ ఫైనాన్స్ డైరెక్టర్ పురుషోత్తం నాయుడు, పీఆర్‌వో ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడారు. తమ సంస్థ ద్వారా గ్రామంలో అనేక సేవా కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. ములగాడ జాలువా కాలనీకి వాటర్ ప్లాంట్, బోరు, 100 కుర్చీలు, బీరువాను అందజేసినట్టు వివరించారు. గ్రామంలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రానికి రూ. 5 లక్షల విలువైన సామ గ్రిని సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ములగాడ రెడ్డికాలనీ ప్రతినిధి దర్మాల వేణుగోపాల్‌రెడ్డి, గురుబిల్లి రామచంద్రరెడ్డి, పట్నాల నారాయణరెడ్డి, పురుషోతం, జాలువా సంఘం నుంచి పెద్దాడ రమణ,ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైద్యులు తిలక్ పాల్గొన్నారు.

గ్రహణంమొర్రి బాధితుల ముఖాల్లో చిరునవ్వే తమ లక్ష్యం

- దోషి స్మైల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నితిన్ దోషి
- కిమ్స్ ఐకాన్‌లో ఉచిత శస్త్ర చికిత్సలు


మాట్లాడుతున్న డాక్టర్ నితిన్ దోషి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 16: కుటుంబంతో పాటు సమాజం నుంచి హేళనకు గురవుతున్న గ్రహణం మొర్రి బాధితులకు శస్త్ర చికిత్స చేసి వారి ముఖాల్లో చిరునవ్వు చూడడమే దోషి స్మైల్ ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకులు డాక్టర్ నితిన్ దోషి అన్నారు. దోషి స్మైల్ పౌండేషన్, ఇంగా హెల్త్ ఫౌండేషన్ సంయుక్తంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఉచిత గ్రహణంమొర్రి శస్త్ర చికిత్స శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోని గ్రహణం మొర్రి పిల్లలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ పి.సతీశ్‌కుమార్ మాట్లాడుతు ఎంతో వ్యయంతో కూడిన ఈ శస్త్ర చికిత్సలను తమ ఆస్పత్రిలో నిర్వహిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. నిర్వాహకులు డాక్టర్ వైఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ మూడు నెలల నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచితంతా శస్త్ర చికిత్సలు చేయనున్నా మని, బుధవారం నుంచి బాధితులు ఆస్పత్రిలోని దంత చికిత్స విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లీనా దోషి, సాయి బలరామకృష్ణ, ఎ. బాలాజీ, కృష్ణ శ్యామలరావు, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఏప్రిల్ 16: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేస్తున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున స్పష్టంచేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల కోడ్ అమలు , ఓటర్ల నమోదు, నామినేషన్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మా ట్లాడుతూ, సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 361 ఫిర్యాదులు అందగా, వీటిలో 266 పరిష్కరించినట్టు చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన 55 మంది వలంటీర్లు, ఏడు గురు ఒప్పంద ఉద్యోగులు, నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. వీరిలో 26 మందిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్టు స్పష్టంచేశారు. వివిధ రాజకీయ పార్టీలపై 30 ఎఫ్ఐలు నమోదు చేసినట్టు వివరించారు. ఇందులో వైసీపీపై 7, టీడీపీపై 6, జనసేనకు సంబంధించి నాలుగు, ఇతరులపై 13 ఉన్నట్టు చెప్పారు. వివిధ చోట్ల తనిఖీల్లో ఇప్పటివరకు వస్తు, ధన రూపేణా రూ. 5.02 కోట్లు సీజ్ చేసినట్టు తెలిపారు. కమిటీ ద్వారా సరైన పత్రాలు చూపిన కొందరికి నగదు తిరిగి అందజేసినట్టు వివరించారు. సాధారణ వ్యక్తులు రశీదులు, పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకువెళ్లరాదన్నారు. స మావేశంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పక్కాగా ఏర్పాట్లు: ఆర్‌డీవో


మాట్లాడుతున్న ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యరుల నామినేషన్లు దాఖ లకు జ్ఞానాపురంలోని జీ వీఎంసీ జోన్-5 కార్యా లయంలో అన్ని ఏ ర్పాట్లుచేసినట్లు పశ్చి మ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. మంగళవారం నామినేషన్ల స్వీకరణ, హోమ్ ఓటింగ్ తదితర అంశాలపై నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్స్, బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో నామినేషన్ల స్వీకరణలో విధివిధానాలను వివరించారు. సందేహాలు ఉంటే ఆర్‌ఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. పోలింగ్ షెడ్యూల్ వివరించారు. వృద్ధులు ఓటువేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. సమావేశంలో ములగాడ, గోపాలపట్నం తహసీల్దార్లు శ్రీనివాస్ మిశ్రా, విజయభాస్కర్, జోన్-5, జోన్-8 జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి. కృష్ణహైమావతి తదితరులు పాల్గొన్నారు

యూపీఎస్సీ పరీక్షలు పక్కాగానిర్వహించాలి:ఆర్‌డీవో


మాట్లాడుతున్న ఆర్‌డీఓ మోహన్‌కుమార్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 16: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను, లైజన్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులకు లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తపాలా శాఖ పర్యవేక్షకులు గజేంద్రకుమార్, పోలీస్, తపాలా, వైద్య ఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కొత్తగా ఏడు బస్సులు


కొత్త అల్ట్రాడీలక్స్ బస్సు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 16: పీటీడీ విశాఖ రీజియన్‌కు ఏడు కొత్త బస్సులు వచ్చాయి. ఇందులో ఐదు సూపర్ లగ్జరీ సర్వీసులు, రెండు ఆల్ట్రా డీలక్స్ బస్సులున్నాయి. మంగళవారం సాయంత్రం వీటికి ట్రయిల్ రన్ పూర్తిచేశారు. ప్రధాన రూట్ల ఆక్యుపెన్సీ రేషియో పరిశీలించిన తరువాత బుధవారం నుంచి విశాఖ-ఇచ్ఛాపురం మధ్య రెండు ఆల్ట్రాడీలక్స్ సర్వీసులు, విశాఖ-శ్రీకాకుళం మధ్య నాన్‌స్టాప్‌లుగా మిగిలిన బస్సులు నడపాలని నిర్ణయించారు.

ఎన్నికల్లో అంకితభావంతో పనిచేయాలి: జేసీ

మహారాణిపేట, ఏప్రిల్ 16: ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులు అంకిత భావంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూరి అశోక్ అన్నారు. ఎన్నికల సన్నద్ధతపై కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

బీసీ, ఎస్సీ, మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం

» దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ


వంశీకృష్ణ కు స్వాగతం పలుకుతున్న మహిళలు


కరపత్రాలు అందిస్తున్న వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 16: బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని దక్షిణ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం గ్రేటర్ 36వ వార్డు రెల్లివీధి, ఆశీపాపవీధి, కాకరవీధిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ముస్లింలు, ఎస్సీ వర్గాలనుంచి ఆయనకు విశేషం ఆదరణ లభించింది. వైసీపీ ఎస్సీలు, మైనార్టీలతో బీసీలను వంచించించిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కృషి చేయాలని వంశీకృష్ణ వారిని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఆయా సంఘాల నేతలు, స్థానిక పెద్దలు, కుల సంఘాల నాయకులు వంశీకృష్ణకు భరోసా ఇచ్చారు. పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన పార్టీల అభ్యర్థులకు పూర్తి సహకారం అందిస్తామంటూ హామీ ఇచ్చారు. వంశీ కృష్ణతో కలసి పలు వీధుల్లో పర్యటించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా వంశీ కృష్ణగాజు గ్లాస్‌కు ఓటేయాలంటూ స్థానికులను జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. ప్రతి వీధిలో వంశీ కృష్ణ ప్రచారానికి ప్రజలనుంచి సానుకూల స్పందన కనిపించింది. చిరు వ్యాపారులను కలసి అభ్యర్థి వంశీ కృష్ణ ఓటు వేయాలని కోరారు. స్థానిక ప్రాంతాలకు చెందిన కూటమి కార్యకర్తలు, యువకులు ఈ ప్రచారంలో డ్యాన్సులతో హోరెత్తించారు. టీడీపీ సీనియర్ నాయకులు చిన్న రహమాన్, మహిళా నాయకురాలు కేధారి లక్ష్మీ, జనసేన నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా చాప్లిన్ జయంతి

సీతమ్మధార, ఏప్రిల్ 16 : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హాస్య నటుడు, దర్శకుడు, నిర్మాత చార్లీ చాప్లిన్ 135వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చాప్లిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ చాప్లిన్ జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా ఆ యన జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, ఇమంది ఈశ్వరరావు, బి.న్నారావు, హుస్సేన్, బాబూరావు రెడ్డి, బాబ్జీ పాల్గొన్నారు.

వైసీపీ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలి

» ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలంటే కూట మి అభ్యర్థులను గెలిపించాలని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు విష్ణుకుమార్‌రాజు గజమాల వేసి సత్కరించారు. అనంతరం ఆయన ఇం టింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుతం హయాంలో గత ఐదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఈస్థితిలో అటువంటి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా ఐక్యంగా కంకణం కట్టుకోవాలని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం నిత్యాసవర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, సీతమ్మధార మండల బీజేపీ అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, నాయకులు ఎన్.రఘునాథ్, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి యాగాటి ఆదిలక్ష్మి, అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత పాల్గొన్నారు.


విష్ణుకుమార్‌రాజుకు గజమాల వేస్తున్న నాయకులు

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 16: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06565 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.35 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మల్దా చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50కు మల్దాలో బయలుదేరి మర్నాడు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.00కు బెంగళూరు చేరుతుంది. 07221 నంబరు గల రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారం ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.25 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారం మధ్యాహ్నం 12.20 కు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 3.20కు దువ్వాడ చేరుతుంది.

కాపులంతా కూటమి వైపు నిలవాలి

» కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్


సంఘీభావం తెలుపుతున్న కాపు సంఘాల ప్రతినిధులు

సీతంపేట, ఏప్రిల్ 16: అన్ని విధాలా వంచించిన వైసీపీ వైపు కాకుండా, కాపులంతా ఈ ఎన్నికల్లో కూటమి వైపు నిలబడాలని కాపు జేఏసీ సభ్యులు ఆరేటి ప్రకాశ్, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాపునేతలంతా కూటమి అభ్యర్థులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ 5 శాతం అమలుకాక, కాపు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాపులకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. ఈస్థితిలో రాష్ట్రం బాగుండాలంటే దూరదృష్టి ఉన్న చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. జగన్మోహన్ రెడ్డి కాపులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఎక్కువగా కౌలు రైతుల ఉన్న కాపు కులాన్ని అణగదొక్కారన్నారు. తమ సామాజిక వర్గం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఈడబ్ల్యూసీలో 5 శాతం రిజర్వేషన్ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రబాబుతోనే సాధ్యమైందన్నారు. పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ వైసీపీ పూర్తిగా అమలు చేయక విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 పైగా కాపు భవనాలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకి చెందిందన్నారు. విదేశీ విద్యను మూడేళ్లుగా పరిగణనలోకి తీసుకోకుండా మోసం చేశారన్నారు. ఈస్థితిలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారంతా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో తుమ్మల సత్యారావు, ప్రగడ చిన నాగేశ్వరరావు, కర్రి వెంకటరమణ, సిరిసిపల్లి రమణ, మార్కినీడు మణికంఠ, అన్నం వెంకటరావు ఉన్నారు.

మారని యూసీడీ తీరు

... 3వ పేజీ తరువాయి

ముమ్మరం చేశారు. ముందుగా తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే యూసీడీ విభాగం అధికారులు, సిబ్బందిని నేతలు కలుస్తున్నారు. వారికి తాయిలాలు అందజేసి తమకు అనుకూలంగా మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేయిస్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్టు వినాలని ఉన్నతాధికారులు సైతం ఆదేశిస్తుండడంతో యూసీడీ విభాగంలోని సీఓలు, ఆర్పీలు అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా తమ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ మేరకు ఆర్పీలంతా తమ పరిధిలోని సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యుల ఓటర్లు కార్డు, రేషన్ కార్డులను తీసుకుంటున్నారు. ఆ వివరాలను తమ ఉన్నతాధికారుల ద్వారా అధికార పార్టీ అభ్యర్థులకు పంపిస్తున్నారు. తమకు అందిన జాబితా ప్రకారం ఓటుకు రూ.వెయ్యి చొప్పున లెక్కేసి, కార్డులు ఇచ్చినవారి ఇళ్లకు వైసీపీ వార్డు స్థాయి నేత మనుషులతోపాటు అభ్యర్థి తరపున నియమించుకున్న మనిషి వెళ్లి అందజేసి తమ నాయకుడికి ఓటెయ్యాలని కోరుతున్నారు. ఇదే తరహాలో తూర్పు నియోజకవర్గ వైసీపీ నేత కార్యాలయానికి వెళ్లి, ఆయన విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారనే అభియోగంపై ముగ్గురు సీఓలను జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున రెండు రోజుల కిందట సస్పెండ్ చేశారు. బాధ్యుడైన ఏపీడీకి ఛార్జ్‌మెమో ఇవ్వడంతోపాటు ఎన్నికల విధుల నుంచి తొలగించాలంటూ జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. వీరితోపాటు 20 మంది ఆర్పీలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించడం యూసీడీ అధికారులు, సిబ్బందిలో గుబులు రేపింది. ఇకనైనా యూసీడీ సిబ్బంది తమ పరిధిలోనే ఉండి, వైసీపీ నేతలకు మద్దతుగా కార్యక్రమాలు నిలిపేస్తారని అంతా ఆశించారు. కానీ అలాంటి వాటిని తాము పట్టించుకునే ప్రసక్తే లేదన్నట్టు కొంతమంది వ్యవహరిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా ఉత్తర నియోజకవర్గం పరిధిలోని తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న వార్డు సచివాలయంలో ఒక సీఓ తన పరిధిలోని ఆర్పీలతో సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఇంత జరిగినా వీరి వైఖరిలో మార్పురాలేదంటూ జీవీఎంసీ అధికారులు సైతం నిట్టూరుస్తున్నారు. ఆర్పీలు, సీఓల తీరుపై జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్ఫూర్తిదాయకం.. హనిత విజయం

... 3వ పేజీ తరువాయి

ఇండియన్ రైల్వేలో సీనియర్ ఇన్‌స్పెక్టర్. ప్రాథమిక విద్యాభ్యాసం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు టింపనీలో సాగింది. ఇంటర్మీడియట్ ఫిడ్జ్‌లో పూర్తిచేశా. ఇంటర్ తరువాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్‌లో చేరా. అయితే, ఆ సమయంలో అనారోగ్యం బారినపడడంతో బీటెక్ పూర్తిచేయలేకపోయా. 2013లో అత్యంత అరుదుగా కనిపించే వెన్నముక ఇన్‌ఫెక్షన్ బారినపడ్డా. ఆ ఇన్‌ఫెక్షన్ వల్ల నాలుగు గంటల్లోనే పెరాలసిస్ వచ్చింది. కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. అనేక ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రెండేళ్లపాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. తల్లిదండ్రులు సహకారం, గురువు రామదూతస్వామి ప్రోత్సాహం, ఆశీస్సులతో మళ్లీ సాధారణ స్థితికి రాగలిగాను. ఆయన సూచనతోనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తరువాత సివిల్స్ దిశగా ప్రయాణం ప్రారంభించా. 2020లో తొలిసారి అటెమ్ట్ చేశా. మూడు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్ క్లియర్ చేశా. మెయిన్స్‌లో విఫలమయ్యాను. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్, ఇంటర్వ్యూ క్లియర్ చేయడంతోపాటు మంచి ర్యాంకు సాధించాను. ఈ ర్యాంకు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. గత ఏడాది గ్రూప్-1 కూడా అటెమ్ట్ చేశాను. ఏవో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం నగర పరిధిలోని మానసిక ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ పనిచేస్తుండగానే సివిల్స్ ర్యాంకు వచ్చింది.

ఇంట్లో ప్రిపరేషన్

సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఇంట్లోనే ప్రిపేరయ్యాను. మెటీరియల్ సొంతంగా తయారు చేసుకున్నాను. మెయిన్స్‌కు మాత్రం సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీతోపాటు పలుచోట్ల తీసుకున్న శిక్షణ, గైడెన్స్ ఎంతగానో ఉపకరించాయి. మొదట్లో ప్రతిరోజూ ఎనిమిది గంటలు చదవడానికి కేటాయించేదాన్ని. ఆ తరువాత క్రమంగా ఆరు గంటలు సమయాన్ని కేటాయించాను. గైడెన్స్ లేకపోవడంతో తొలి మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యాను. మూడుసార్లు ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో వాటిని సరిదిద్దుకుని నాలుగో ప్రయత్నంలో విజయం సాధించాను. ఇందుకు ఫ్యాకల్టీ, తల్లిదండ్రులు అందించిన సహకారం చాలా గొప్పది.

నిరాశ వద్దు..మంచి రోజులు ఉంటాయి..

ఎటువంటి పరిస్థితుల్లోనూ నిరాశకు గురికావద్దు. చీకటి వెంటే వెలుగు ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలి. దీనికి నేనే ఒక ఉదాహరణ. ఇక జీవితం లేదు అనుకుని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిన నేను..మళ్లీ ఈరోజు గెలుపుబాట పట్టాను. నిరాశకు లోనైన ప్రతి ఒక్కరూ ఆశతో రేపటి కోసం చూడాలి. మంచి రోజులుతప్పక వస్తాయి. అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునేందుకు అంకిత భావంతో కృషిచేయాలి. అప్పుడే గెలుపుబాట పడతాం. మనమేంటో నిరూపించుకునే అవకాశం ప్రతి ఒక్కరికీ వస్తుంది. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూవిడిచిపెట్టకూడదు. రెండేళ్లపాటు నేను నరకాన్ని అనుభవించాను.అప్పటివరకు ఆనందంగా సాగిపోయిన జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. తల్లిదండ్రులు కూడా తీవ్రంగా వేదన అనుభవించారు. కానీ, నేను బాధపడకూడదని వాటిని బయటపడనీ యలేదు. ఈ జర్నీలో అమ్మా, నాన్న ప్రోత్సాహం,వారి సహకారం మరువలేనిది. సివిల్స్ అంటే చాలా పోటీ ఉంటుంది.ఎంతపోటీఉన్నాప్రణాళికప్రకారం ముందుకువెళితే విజయం సాధ్యమే.

ఫ్లైఓవర్స్ ఏవీ?, ఎక్కడ??

... 3వ పేజీ తరువాయి

సగటున ఒకరు ప్రాణాలు కోల్పోతుంటే ముగ్గురు క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఏటేటా వీటి సంఖ్యతోపాటు మృతుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. నగరవాసులతోపాటు పోలీస్, జీవీఎంసీ అధికారులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడం, జనాభా పెరుగుతుండడంతో 2030 నాటికి వాహనాల సంఖ్య 25 లక్షలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నాలుగు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, ఒకచోట ఆర్‌ఓబీ, మరోచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు వీలుగా గాజువాక, సత్యం కూడలి/మద్దిలపాలెం, హనుమంతవాక, పీఎం పాలె కార్‌షెడ్ కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని ప్రతిపాదించారు. వీటితోపాటు గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదన ఎప్పటినుంచో ఉన్నందున దాన్ని కూడా ప్రారంభించి, పూర్తిచేస్తామని ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కొత్తలో వైసీపీ నేతలు హామీలు గుప్పించారు. అలాగే మధురవాడలోని చంద్రంపాలెం వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు అవకాశం లేదు. దీంతో జాతీయ రహదారి పైనుంచే అటు నుంచి, ఇటు నుంచి అటు దాటుతున్నారు. దీనివల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటుండడంతో పాదచారులు తరచూ మృత్యువాతపడడం, గాయపడడం జరుగుతోంది. దీంతో అక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. వీటిలో కొత్తపాలెం వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం కోసం అధ్యయనం చేసి ఫీజుబులిటీ నివేదిక ఇవ్వడానికి ఆసక్తి, అర్హత, అనుభవం కలిగిన ఏజెన్సీల నుంచి 2020 జనవరి 27న జీవీఎంసీ అధికారులు ఆర్‌ఎఫ్‌పీ పిలిచారు. ఎంపికైన ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత నాలుగు నెలల్లోగా డీపీఆర్‌ను అందజేయాలని, ఆ తర్వాత ఆ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడంతోపాటు నగరంలో నిర్మించతలపెట్టిన నాలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణంపై ముందుకువెళ్లేందుకు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో వివరించారు. నాలుగేళ్లు గడిచిపోయినా ఇంతవరకూ వైసీపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనపై ఒక్క అడుగు కూడా ముందుకువేయలేకపోయింది. కొత్తపాలెం ఆర్‌ఎఫ్‌పీపై కూడా ఇంతవరకూ అతీగతీలేదు. అలాగే చంద్రంపాలెం వద్ద జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మూడు నెలల కిందట అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ముందుకుసాగలేదు. ఐదేళ్ల పాలనలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం నగర అభివృద్ధిపై వైసీపీకి గల చిత్తశుద్ధికి తెలియజేస్తోందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గంజాయి విక్రయదారుల మధ్య కొట్లాట

» ఏడుగురు అరెస్టు.. 22 కేజీల గంజాయి స్వాధీనం

సీతంపేట, ఏప్రిల్ 16: అక్రమంగా గంజాయి తరలింపు, విక్రయం, ఈ గ్రూపుల మధ్య దాడులకు సంబంధించిన కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాలుగో పట్టణ పోలీసు సీఐ విజయ్‌కుమార్ అందించిన వివరాలివి.. ఈనెల 14వ తేది రాత్రి కైలాసపురం సాలిగ్రామపురం వెంకటేశ్వర స్వామి ఆ లయం మెట్ల వద్దకొంత మంది గుమిగూడి గొడవ పడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందిందింది. దీంతో సీఐ విజయ్‌కుబమార్, ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. గొడవ పడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురుపరారయ్యారు. ఈ క్రమంలో రౌడీ షీటర్ పెద్దిశెట్టి రూపేశ్‌ను గుర్తించి విచారణ చేపట్టారు. దీంతో వ్యసనాలకు బానిసైన అతను డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితులు అయిన కర్రి నవీన్ శ్రీనివాస్, చింతలపూడి శ్రీను అలియాస్ డాన్ శ్రీను, బత్తుల నారాయణరావు, గులివిందు శ్రీనువాస్‌లతో కలిసి అరకు, పాడేరు గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడ కిలో గంజాయి రూ.2 వేల చొప్పున కొనుగోలుచేసి నగరానికి తీసుకువచ్చి అమ్మకాలు సాగించారు. ఈ క్రమంలో సాలిగ్రామపురం సింహగిరి కాలనీకి చెందిన కుప్పు సాయి చైతన్య కుమార్, నీరజ్ సాయి వినయ్‌లకు వీరిద్దరితో పాటు మరో ముగ్గురికి గంజాయి ఈ వి క్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపార లావాదేవీల్లో తేడా వచ్చి ఈనెల 14వతేదీన పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి మొత్తం 22 కిలోల గంజాయిస్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు కోసం గాలిస్తున్నారు.

వలంటీర్లు లేకుంటే గెలవలేరా?

» 15 మందితో రాజీనామా చేయించిన ఉషశ్రీ, కేకే రాజు


రాజీనామా చేశాక కేకే రాజుని కలిసిన వలంటీర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు వార్డు వలంటీర్ల సాయం లేకపోతే ఈ ఎన్నికల్లో విజయం సాధించలేమని భయపడుతున్నారు. ఇప్పటివరకు వారితో అన్ని రకాల పనులు చేయించుకుని, ఎన్నికల సమయంలో దూరంగా పెట్టాలంటే వారికి మనసు ఒప్పడం లేదు. వారు ఉంటే తప్ప విజయం దక్కదని భావిస్తున్న పలువురు అభ్యర్థులు వలంటీర్లను నయానో, భయానో ఒప్పించి రాజీనామాలు చేయిస్తున్నారు. ఇప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి కేకే రాజు అదే పనిచేశారు. ఆయన వర్గంలో ముఖ్య నాయకురాలిగా ఉన్న 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ, తన ప్రాంతంలో పనిచేస్తున్న 15 మంది వలంటీర్లతో మంగళవారం ఆ ఉద్యోగాలకు రాజీనామా చేయించారు. వెంటనే వారిని కేకే రాజు వద్దకు తీసుకెళ్లారు. వారితో మళ్లీ జగన్‌ని సీఎంగా గెలిపించడానికి, కేకే రాజు విజయం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే వలంటీర్లకు మళ్లీ నియామకపు ఉత్తర్వులు ఇస్తామని, ఇంకా మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఈ రెండు నెలలు రాజీనామా చేసి పనిచేసినందుకు వారికి భారీగానే మొత్తాలు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. వాటికి ఆశపడే పలువురు రాజీనామా చేస్తున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

సైబర్‌క్రైమ్‌కు హాట్‌స్పాట్‌గా విశాఖ

... 3వ పేజీ తరువాయి

ఏర్పాటుచేశారు. గత మూడేళ్లలో నగరంలో 12 వేల మందికిపైగా సైబర్ మోసాలకు గురయ్యారన్నారు. వీరంతా రూ.85 కోట్లు వరకూ పోగొట్టుకున్నారని, అందులో కేవలం రూ.18 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగామన్నారు. సైబర్‌క్రైమ్ బారినపడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, దీన్ని నియంత్రించేందుకు సైబర్ మోసాలు జరిగే తీరుతెన్నులపైనా, మోసానికి గురైతే తక్షణం చేయాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందన్నారు. సైబర్ మోసాలు జరిగే విధానం, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన నాలుగు వీడియోలతోపాటు హ్యాండ్‌బుక్, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. హ్యాండ్‌బుక్‌ను కాలేజీలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో అందుబాటులో ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రస్తుతం కొరియర్ సర్వీసు, గేమ్ టాస్క్, ట్రేడింగ్, లోన్ యాప్‌ల పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్‌చేయాలన్నారు. దీనివల్ల తక్షణం స్పందించి బ్యాంకు నుంచి నగదు ఏఏ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయిందో గుర్తించి ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫెడెక్స్ కొరియర్ పేరుతో 2023, 2024లో ఇప్పటివరకూ 12 మంది మోసానికి గురై రూ.1.08 కోట్లు పోగొట్టుకున్నారన్నారు. గేమ్‌టాస్క్ పేరుతో 2022, 2023, 2024లో ఇంతవరకూ 213 మంది మోసానికి గురై రూ.18.42 కోట్లు నష్టపోయారన్నారు. లోన్‌యాప్ పేరుతో జరిగే మోసాల్లో 2022, 2023 సంవత్సరాల్లో 21 మంది రూ.77 లక్షలు నష్టపోయారన్నారు. నకిలీ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్న పది మందిని అరెస్టు చేశామన్నారు. గత నాలుగేళ్లలో జరిగిన సైబర్ నేరాలకు సంబంధించి ఎన్‌సీఆర్‌బీ, సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలు ప్రకారం నిందితులుగా ఉన్న నగరానికి చెందిన 126 మందిని గుర్తించామని, వారిలో 36 మందిని అదుపులోకి తీసుకుని వారి పాత్రపై విచారణ చేస్తున్నామన్నారు. సైబర్‌క్రైమ్‌కు పాల్పడుతున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారు, నకిలీ ధ్రువపత్రాలతో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటుండడం వల్ల వారిని గుర్తించడం క్లిష్టతరంగా మారుతోందన్నారు. ఈ సమావేశంలో సైబర్‌క్రైమ్ సీఐలు కె.భవానీప్రసాద్, లక్ష్మణరావు, ఎస్ఐ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం

... 3వ పేజీ తరువాయి

ఢీకొట్టింది. దీంతో అతడు బైక్‌తో సహా లారీ కిందకు వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన సన్నిబాబును 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. సన్నిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీఐ ఎల్.రామకృష్ణ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

వైసీపీ మాజీ నేత వెంకట నరసింహారావు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 16: రానున్న ఎన్నికల్లో పెందుర్తి నుంచి వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీలో సీనియర్ నేతలకు గుర్తింపు లేదని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.ఈ నెల 19న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తానన్నారు.



భీమిలిలోని బ్యాంక్ కాలనీలో ప్రచారం చేస్తున్న గంటా శ్రీనివాసరావు



కేటిన్‌పేట జంక్షన్‌లో గంటాను గజమాలతో సత్కరించిన అభిమానులు

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం

భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 16 : రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఈతరుణంలో చంద్రబాబు నాయకత్వం అవసరమని భీమిలి టీడీపీ పార్టీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కేటిన్‌పేట, బ్యాంక్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అనాలోచిత విధానాలు, విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ నాశనమైందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పాలనను గాడిలో పెట్టాలంటే సమర్థవంతమైన చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమన్నారు. జగన్ పాదయాత్రలో పెట్టిన ముద్దులు,అరచేతిలో చూపిన వైకుంఠం, మాయ మాటలు నమ్మి ప్రజలు వైసీపీని గెలిపించారని, అధికారంలోకి వచ్చాన జగన్ తన పాలన ఎలా వుంటుందో ప్రజా వేదిక కూల్చివేతతో చూపించారన్నారు. ఇచ్చిన హామీలన్నీ పేచీలతో, మాయలతో అమలు చేశారని ఆరోపించారు. ఈసారి చంద్రబాబు, పవన్ సూపర్ సిక్స్ పథకాలతో సంతకాలు చేసిన ష్యూరిటీ బాండ్‌లను ప్రజలను అందిస్తున్నారని, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. గతంలో తనను 37 వేల ఓట్ల మెజారిటీతో ఆదరించారని, ఈసారి మరింత ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని కోరారు.తొలుత కేటిన్‌పేట జంక్షన్‌లో టీడీపీ నాయకులు యరబాల అనిల్‌ప్రసాద్, మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి గజమాలతో గంటాను సత్కరించారు. అనంతరం కుంచమాంబ అమ్మవారిని గంటా దర్శనం చేసుకుని ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 2వ కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, నాయకులు గాడు అప్పలనాయుడు, భీమిలి మండల పార్టీ అధ్యక్షుడు అప్పలనరసింహ రాజు, జనసేన నాయకులు కిరణ్, నీలాతి శంకర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, నాయకులు రేఖ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళలతో సమావేశం

బీచ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని తెలుగు మహిళలతో గంటా సతీమణి శారద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో ఒంగోలు సమీపంలోని కామేపల్లి నుంచి విశాఖ వచ్చి స్థిరపడిన తమను భీమిలి ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని చెప్పారు. మరోసారి గంటాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

18 నుంచి నామినేషన్ల ఘట్టం : ఆర్‌డీఓ

భీమునిపట్నం, ఏప్రిల్ 16 : నియోజకవర్గంలో ఈనెల 18 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుందని భీమిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిగా అన్ని విషయాలు పరిశీలించి, నామినేషన్లు దాఖలు చేయాలని, ఇందుకు కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకూ ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. అలాగే రాజకీయ పార్టీలు పబ్లిక్ స్థలాలు, ప్రైవేట్ స్థలాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు మారోజు సంజీవ్‌కుమార్, జనసేన నాయకులు అనిల్, బీఎస్పీ నాయకులు గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో కళాశాలలు తెరిస్తే చర్యలు

మద్దిలపాలెం, ఏప్రిల్ 16 : వేసవి సెలవుల్లో అడ్మిషన్లు, తరగతులు నిర్వహించే ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. మంగళవారం ఆయన పిఠాపురం కాలనీలోని జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆర్ఐవో మురళీకి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి సెలవు రోజుల్లో అడ్మిషన్లు నిర్వహించి లక్షల రూపాయలు దోచుకుంటున్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి కళాశాలల్లో చేర్పించుకుంటున్నారని తెలిపారు.

18 నుంచి మొగధారమ్మ ఉత్సవాలు

సాగర్‌నగర్/ఎండాడ, ఏప్రిల్ 16 : భీమిలి బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్ తీరానికి అభిముఖంగా నిర్మించిన దుర్గాలమ్మ, నూకాలమ్మ సమేత మొగధారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో ఈనెల 18 నుంచి 21 వరకు ఉత్సవాలు జరగనున్నట్టు ఆలయ ట్రస్టు అధ్యక్షుడు సూరపునేని లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 18న ఉదయం నుంచి అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, 19న ఉదయం నవగ్రహారాధన, నవగ్రహ హోమం, కుంభారాధన, 20న ప్రధాన హోమాలు, మహాశాంతి హోమం, 21న ఉదయం యంత్ర స్థాపన, బింబస్థాపన, శిఖర స్థాపన, ప్రథమ అర్చనతో ఆలయంలో ప్రధాన పూజ ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు.

'బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం'

రామ్‌నగర్, ఏప్రిల్ 16 : బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజు గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన రామ్‌నగర్‌లోని ఓ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు.ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లలో చేసిన దురాఘాతాలను ప్రజలు గమనించారని,ముఖ్యంగా బీసీలను కులాల వారీగా విడగొట్టి అణిచివేతకు గురి చేశారని విమర్శించారు. ఒక్కొక్కటిగా ఉన్న బీసీ కార్పొరేషన్లను 64 కార్పొరేషన్లుగా విడగొట్టి వారికి పదవులు కేటాయించి, ఆటబొమ్మలుగా మార్చారన్నారు. ఎన్నికల్లో బీసీలంతా కలిసికట్టుగా టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఆయనతో పాటు మైనారిటీ నాయకుడు ఎం. ముస్తఫా, సంపత్, కల్యాణ్, రమణ, నాయుడు ఉన్నారు.

'కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం'

మద్దిలపాలెం, ఏప్రిల్ 16 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పని చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకట రమణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పిఠాపురం కాలనీ పార్కులో జరిగిన మూడు పార్టీల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న సవేరా ఫంక్షన్ హాల్లో నిర్వహించే మూడు పార్టీల ఆత్మీయ సమావేశానికి అందరూ హాజరుకావాలన్నారు. తూర్పు నియోజకవర్గం అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు 19న నామినేషన్ దాఖలు చేస్తున్నారని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఎన్నికలు సమీపిస్తున్నందున వార్డులో ప్రచారం జోరుగా చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, జనసేన నాయకులు వెంకట ప్రసాద్, దేవర రఘు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో టీడీపీ, జనసేన,బీజేపీ నాయకుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రచారం, బూత్ లెవెల్ మేనేజ్‌మెంట్, ప్రచారానికి కావల్సిన మెటీరియల్స్ తదితర అంశాలపై నాయకులు చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో నాయకులు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, వెంపాడ శ్రీనివాసారెడ్డి, మైలపిల్లి శ్రీను, గరికిన నూకరాజు, చెన్నా శంకర్, ఈగల కొండ, తోట రాజు, డి. అప్పారావు, గరికిన శ్రీను, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పదో వార్డులో టీడీపీ నాయకుల ప్రచారం

ఆరిలోవ, ఏప్రిల్ 16 : తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి కోరారు. మంగళవారం రామలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇందిరానగర్‌లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి పీసం అప్పారావు, సీహెచ్ శ్రీనివాస్, బర్ల చిన్న, మహిళా అధ్యక్షురాలు కిల్లంపల్లి రమణ, బీజేపీ వార్డు అధ్యక్షుడు రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక మారు వారం పండుగ

ఆరిలోవ, ఏప్రిల్ 16 : పాత డెయిరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి మారు వారం పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. డీఈవో చంద్రకళ, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



కృష్ణాపురంలో ముత్తంశెట్టిని, బొత్స ఝాన్సీని పూలమాలతో సత్కరించిన కార్యకర్తలు

మాయ మాటలకు మోసపోవద్దు

భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి

భీమునిపట్నం, ఏప్రిల్ 16 : ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల మాయ మాటలు, ప్రలోభాలకు లొంగిపోవద్దని భీమిలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మంగళవారం ఆయన 3వ వార్డు రెల్లివీధి, గాడువీధి, కృష్ణా కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యర్థులు పెద్ద పెద్ద కార్లలో వస్తారని, వారి వెనుక మరికొంతమంది వచ్చి డబ్బులు చూపి మాయ మాటలు చెబుతారన్నారు. వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం రెల్లివీధి, గాడువీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. వీధివీధినా అవంతికి మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టారు. మరికొందరు దుశ్శాలువతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, ముక్కి కృష్ణ, మారుపల్లి రాము, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, గుండాసు మధునాయుడు, వాసుపల్లి కొండబాబు,మైలపల్లి లక్ష్మణరావు, రామునాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

పద్మనాభం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మద్ది, కృష్ణాపురం పద్మనాభం గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో మాట్లాడారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. జగన్ సభలకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలకు చెందిన వారు రాళ్లు రువ్వే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.పద్మనాభం మండలాన్ని ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైసీపీ యూత్ రీజనల్ కోఆర్డినేటర్ అవనాపు విక్రమ్, ఎంపీపీ రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, మండల పార్టీ నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.



భీమిలిలోని గాడు వీధిలో ముత్తంశెట్టికి హారతి ఇస్తున్న మహిళలు

క్రీడాకారులకు అభినందనలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 : క్రీడల్లో ప్రతిభ చూపిన ఏయూ విద్యార్థులను వీసీ ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఝాన్సీ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ విద్యార్థిని ఎమ్మిరతన్‌ను అభినందించారు.

కొత్తమ్మ తల్లికి బంతి పూలతో అలంకరణ



తగరపువలస, ఏప్రిల్ 16 : సంతపేట కొత్తమ్మ తల్లిని మంగళవారం వందలాది బంతి పూలతో సుందరంగా అలంకరించారు. ప్రతి వారం ఒక్కో విధంగా అమ్మవారిని అలంకరణ చేస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

పద్మనాభం, ఏప్రిల్ 16 : పద్మనాభం కూడలిలో మద్యం బాటిళ్లతో కృష్ణాపురానికి చెందిన సుంకర శ్రీనును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు శ్రీను వద్ద 22 క్వార్టర్ బాటిళ్లు దొరికాయని చెప్పారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఏప్రిల్ 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కల్యాణం మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి కల్యాణ క్రతువు జరిపారు.



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

భీమునిపట్నం, ఏప్రిల్ 16 : అంతర్జాతీయ 6వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2024, 23వ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను కలెక్టర్ మల్లికార్జున మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల వెల్ఫేర్ అడిషినల్ డైరెక్టర్ మాధవి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు టి.రాము, శ్రీహరి, టీమ్ మేనేజర్ జ్యోతి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి జయంతి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 : ఏయూలోని తెలుగు విభాగంలో ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన పలువురు కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న, డాక్టర్ మీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు గోపాలనాయుడు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించే వేదికలు కల్పిస్తాం : వీసీ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 : విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించే వేదికలు కల్పిస్తామని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లఘు నాటికల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులే వర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారన్నారు. ఒక నూతన ఒరవడికి విద్యార్థులు నాంది పలికారని, దీన్ని ఇతర విశ్వవిద్యాలయాలు అనుసరిస్తాయని చెప్పారు. విద్యార్థుల్లో విభిన్న సృజనాత్మక కళలు ఉన్నాయని, వాటిని ప్రోత్సహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది తెలుగుదేశమే

టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎం. శ్రీభరత్, వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 16 : వైసీపీ పాలనతో సర్వనాశనమైన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి గాడిలో పెట్టేది తెలుగుదేశం ప్రభుత్వమేనని తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. మంగళవారం ఆయన 13వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో జరిగిన భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు,వార్డు అధ్యక్షుడు పొత్రకొండ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి యల్లమిల్లి సురేష్,మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, 11వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతో రాష్ట్రానికి భవిత

పెదవాల్తేరు : చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. మంగళవారం 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్, పెదవాల్తేరు, కాగితాలవీధి, చిన్నిపిల్లివీధి, చేపల మార్కెట్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కేరాఫ్ తెలుగుదేశం పార్టీ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చొడే వెంకట పట్టాభిరామ్, నాయకులు పీతల అవినాష్, మువ్వ పోలారావు, సత్తిబాబు, జ్యోతి, శివరెడ్డి, గోపి పాల్గొన్నారు.



పెదవాల్తేరులో మత్స్యకారులు అందించిన చేపతో ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి



సింహాద్రిపురంలో జరిగిన సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

తూర్పులో వైసీపీ జెండా ఎగరవేస్తాం

తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

పెదవాల్తేరు, ఏప్రిల్ 16 : వచ్చే ఎన్నికలో తూర్పు నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన వైసీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మీ దాస్ ఆధ్వర్యంలో పెదజాలారిపేటలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి కుట్రలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సాధ్యం కాని హామీలతో చంద్రబాబు మళ్లీ వస్తున్నారని. ఆయనకు ఓటేస్తే పథకాలన్నీ పోయినట్టేనని చెప్పారు. జగన్‌ది పేదల పక్షమని, తమ ప్రభుత్వానికి ఓటేస్తే జరుగుతున్న మంచి కొనసాగుతుందన్నారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో నాయకులు వాడమోదుల గణేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజలకు సుపరిపాలన

వెంకోజీపాలెం : వైసీపీ పాలనతో ప్రజలకు సుపరిపాలన అందుతుందని పార్టీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి, ఎంపీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన 15వ వార్డు సింహాద్రిపురంలో జరిగిన సిద్ధం సభలో మాట్లాడారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఎన్నో పనులు చేశామని, కల్యాణ మండపాలు, డ్రైనేజీలు, రోడ్లు నిర్మించామని చెప్పారు. అలాగే రూ. 3 కోట్లకు పైగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారని తెలిపారు.కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, అప్పారి గిరిబాబు, నడింపల్లి కృష్ణంరాజు, పీల వెంకట పరదేశినాయుడు, బుగత యేసురత్నం, పాల్గొన్నారు.



పెదవాల్తేరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసీపీ అభ్యర్థి సత్యనారాయణ, నాయకులు

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 26, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళా దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 155, బరబటి 30,ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 100, పొటల్స్ 68, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 108
ఫారం ధర	-- 128
విత్ స్కిన్	-- 226
స్కిన్‌లెస్	-- 236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

ప్రముఖులకు అప్పన్న కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలు

సింహాచలం, ఏప్రిల్ 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 19 నుంచి జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ దేవస్థానం అధికారులు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి మంగళవారం చినముషిడివాడ వెళ్లి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి పీఠంలో స్వయంగా అతిథి మర్యాదలతో సత్కరించి, ఆహ్వానించారు. అలాగే రెండు రోజుల క్రితం స్వామివారి పెళ్లికి ఆడపెళ్లివారుగా జాలరి కుల పెద్ద కదిరి లక్ష్మణరావుకు ఆహ్వాన పత్రిక ఇచ్చి రథోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాగా స్వామివారికి కోట్లాది రూపాయల ఆస్తులు అందజేసిన పీవీజీ రాజు కుటుంబానికి చెందిన ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజుకు ఆహ్వాన పత్రిక ఇచ్చేందుకు దేవాలయ సిబ్బంది మాత్రమే వెళ్లడం, ఈఓ వెళ్లపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్సవాలకు విరాళాల వెల్లువ

సింహాచలం, ఏప్రిల్ 16 : అప్పన్నస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం, చందనోత్సవం నేపథ్యంలో దాతలు అధిక సంఖ్యలో విరాళాలు సమర్పిస్తున్నారు. వార్షిక కల్యాణోత్సవంలో ఐదు రోజుల పాటు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, ఉభయ దేవేరులకు, అలాగే ఆలయ ఆవరణలోని వివిధ దేవతామూర్తులకు నూతన పట్టు వస్త్రాలను రూ. 5 లక్షలు వెచ్చించి బరంపూర్‌కు చెందిన రవికుమార్ అందజేయగా కల్యాణోత్సవంలో తలంబ్రాలు నిమిత్తం వినియోగించేందుకు గోపాలపట్నంలోని స్వర్ణ జ్యూవెలరీ సంస్థ యాజమాన్యం రూ.70 వేలు విలువ చేసే మంచి ముత్యాలను ఇచ్చారు. నగరానికి చెందిన శ్రీరామ వెంకట నరసింహం చందన పూత వేళ స్వామివారికి వేసే పొత్తి వస్త్రం (సుమారు రూ. 87 వేలు) అందజేశారు.

తాగునీటి సమస్య తీర్చాలని తీర్మానం

పద్మనాభం, ఏప్రిల్ 16 : మండలంలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ కె. రాంబాబు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బోర్లు వట్టిపోయినందున ప్రతి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయించాలని కోరారు. శేకిఖండం, గంధవరం, బాపిరాజు తాళ్లవలస గ్రామాల సర్పంచులు తమ పరిధిలో గతంలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. రేవిడిలో కూలిపోయిన ఆరు విద్యుత్ స్తంభాలను నిలబెట్టి లైన్లు వేయాలని కోరుతున్నా .. అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు సూరప్పుడు ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శైల, వైస్ ఎంపీపీ రాజేశ్వరి పాల్గొన్నారు.